

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



(ప్రారంభం)

*రచనా కాలం : 2019*

**జ్ఞాపకాలు..!**

ఒంటరి తనపు వ్యాపకాలు.

కంటిపాపల వెనుక కదలాడే రూపకాలు..

కొన్ని జ్ఞాపకాలు 'ఆవేదన' కలిగిస్తాయి..

అపుడు అంతరంగాన 'నల్లమబ్బులు' కమ్ముకొస్తాయి!

ఇంకొన్ని జ్ఞాపకాలు ఆ'వేదన'నంతా మరిపిస్తాయి.

అపుడు ఆత్మ అంచున 'ఇంద్రధనుస్సు'లు వెల్లివిరుస్తాయి!

ఒకటీ రెండూనా?

వందా వెయ్యీనా?

జీవితపు పుటల్ని తిప్పినకొద్దీ జ్ఞాపకాలే!

ఆప్యాయత ఒడిలో అమ్మ పెంపెకం..

భయభక్తుల బడిలో పాఠాలు చదవటం..

బతుకు బాటకై ఉద్యోగాన చేరటం..

జీవన సమరానికై ఇంటివాడు కావటం..

ఇవన్నీ జ్ఞాపకాలే!

ఒకరు తర్వాత ఒకరుగా

ముగ్గురబ్బాయిలు పుట్టటం..

చదువు సంధ్యలు చెప్పించి ప్రయోజకుల్ని చేయటం..

రెక్కలు తొడుక్కున్నాక పెద్దవాడు చిన్నవాడు

అంతరిక్షాన అమెరికా దేశానికి ఎగిరిపోవటం..

మధ్యముడు మాత్రం నన్ను వెన్నంటే వుండటం..

ఇవి కూడా జ్ఞాపకాలే!

ముందుగా నాన్న ఒడిలో అమ్మ కన్నుమూయటం..
ఆ తర్వాత ఏడేళ్ళకే -
ఆయాసంతో అవస్థ పడుతున్న నాన్నని
కారులో ఆస్పత్రికి తీసుకెడుతుంటే
అమ్మకోసమే ఆకాశంలోకి చూస్తూ
నా భుజంపై తలవాల్చి తనువు చాలించటం..
మాటి మాటికి తరుముకొచ్చే జ్ఞాపకాలు!

సాటి మనుషులు రాకపోయినా
తోటిమనుషులు లేకపోయినా
జీవితాంతం జ్ఞాపకాలే మనిషికి తోడు రాకపోతే
ఆ మనిషి ఏమవుతాడు?

శ్వాసల ఆకుల్ని రాల్చుకున్న వృక్షంలా
అడవిలో ఎండిన మోడులా నిలబడతాడేమో!..
అందుకే ఆ దేవుడికి శిరసాభివందనం చేస్తున్నా -
నన్ను పుట్టించి జ్ఞాపకాల దొంతర్లను
దాచుకునేందుకు
మనసు పొరల్ని అరువిచ్చినందుకు!
ఆ పొదల్ని తొలగించి నా జ్ఞాపకాల్ని మీతో పంచుకుంటున్నందుకు -

- జీడిగుంట రామచంద్రమూర్తి

అది 1940వ సంవత్సరం. ఫిబ్రవరి నెల 13 వతేదీ రాత్రి 10.54నిమిషాల సమయం.

పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు గ్రామంలో నివాసం వుంటున్న డాక్టర్ జీడిగుంట రామకృష్ణారావ్, వెంకట నరసమ్మ దంపతులకు పెద్దకొడుకుగా నేను పుట్టిన సంగతి నాకు ఊహ వచ్చాక తెలిసింది. నిడదవోలు మెయిన్ రోడ్డుమీద వున్న గాంధీ బొమ్మకీ, నెహ్రూ బొమ్మకీ మధ్య మా యిల్లు వుండేది. ఇంటి ముందు భాగంలో మూడు షాపులు నిర్మించి, మా తాతగారైన కామరాజుగారు, అద్దెలకు ఇచ్చారు. ఒక షాపులో ఒకనాటి ప్రముఖ రంగస్థల నటుడు శ్రీ జువ్వాది రామారావు ప్రింటింగు ప్రెస్సు నడుపుకునేవాడు. ఆ షాపుల వెనుకవైపున మూడు వాటాలు వేసి, ఒక వాటాలో మా నాన్నగారూ, అమ్మా ఉండేలా ఏర్పాటు చేశారు.

మా తాతగారు ఎల్.ఎమ్.పి. డాక్టర్‌గా ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసి, నేను పుట్టేనాటికి నిడదవోలులో స్థిరపడ్డారు. ఆయనకు, మా నాన్నగారు పుట్టిన పదేళ్ళలోపే సతీ వియోగం కలగటంతో రెండో పెళ్ళి చేసుకున్నారు. ఆవిడ పేరు మాణిక్యాంబ. ఆవిడకు ఇద్దరు అబ్బాయిలు ఒక అమ్మాయి కలిగారు. అందరం కలిసి ఉమ్మడి కుటుంబంగా ఎంతో కలివిడిగా వుండేవాళ్ళం.

ఇక నా తల్లిదండ్రులకు నా తర్వాత ఒక అమ్మాయి (గౌరీ మనోహరం) ముగ్గురు అబ్బాయిలు (కామరాజు, వెంకటరమణ, నాగేశ్వరరావు) రెండేసి సంవత్సరాల వ్యవధుల్లో జన్మించారు. ఇప్పటికీ నేను నా తమ్ముళ్ళ కుటుంబాలతో, చెల్లెలి కుటుంబంతో వాళ్ళ వాళ్ళ పిల్లాపాపలతో హైదరాబాద్‌లోనే ఎంతో ఆత్మీయానుబంధంతో జీవితాన్ని కొనసాగిస్తున్నాను.

నిడదవోలులో మా ఇల్లు చాలా పెద్దది. విశాలమైన వాకిలి. ఆ వాకిట్లో చుట్టూ పెద్ద పెద్ద అరుగులు. మాకు బంధుబలగం కూడా ఎక్కువే. తెలిసిన వాళ్ళందరూ మా ఇంటిని 'జీడిగుంటవారి ఆస్థానం' అనేవారు. మా ఇంటికి వెనుక భాగన రైలు పట్టాలుండేవి. ఇపుడూ వున్నాయి. ఆ పట్టాల వెనుక నిండుగా ప్రవహించే కాలువ. దాన్ని 'నిడదవోలు మడుగు' అనేవారు.

ఆ కాలువకి రోజూ ఉదయంపూట మా తాతగారు వెళ్ళి స్నానం చేసి వస్తూండేవారు. అయిదేళ్ళ వయస్సు వచ్చాక నన్ను కూడా తమ వెంట తీసుకువెడుతూండేవారు. ఓ రోజు ఆ కాలువలో నేను స్నానం చేస్తూ, ముందు మూడు మెట్లు దిగి, నాలుగో మెట్టుకూడా వుందనుకుని కాలువేశాను. కానీ మెట్టు అందలేదు. నీళ్ళలోకి జారిపోయి మునిగిపోయాను. 'తాతయ్యా, తాతయ్యా' అంటూ పైకి ఎగురుతూ అరిచేసరికి - మా తాతగారు గాభరా పడిపోయి పక్కనేవున్న ఓ మనిషిని పిలిచారు. ఆ మనిషి వెంటనే నీళ్ళలోకి దూకి నన్ను పైకి లాక్కొచ్చాడు. ఆ మనిషెవరో నాకు తెలియదు. నాకు ప్రాణభిక్ష పెట్టిన దేవుడే అనుకున్నాను.

అప్పట్లో వేసవికాలం వచ్చిందంటే రెండు నెలలపాటు ఆ కాలువ కట్టేసేవారు. అపుడు మా అమ్మ ఇంటి వెనుక వున్న రైలు పట్టాలు దాటి, కాలువకు వెళ్ళి అందులోని ఇసుకను చేత్తో బయటకు లాగి 'చెలమలు' తీసి వాటిల్లో ఊరే నీటిని గ్లాసుతో తోడి, బిందెలో నింపి తీసుకొచ్చేది. అపుడు నేనూ అమ్మకు సాయపడేవాడిని.

మా కుటుంబం పెద్దది కావటంతో అవసరాలు పెరుగుతూ వచ్చాయి. మా నాన్నగారికి ప్రత్యేకించి సంపాదన ఉండేది కాదు. అపుడు మా తాతగారు ఆయనను మదరాసు పంపించి, వైద్యవిద్యలో ఏదో సర్టిఫికెటు కోర్సు చదివించారు. ఓ ఏడాదిపాటు అక్కడ చదివిన తర్వాత ఎల్.ఎమ్.ఎస్. హెచ్. సర్టిఫికెట్ ఓ తిరిగి వచ్చాక, నర్సాపురంలోని ఓ మిషన్ ఆస్పత్రిలో వుంటున్న చెరియన్ అనే డాక్టరుగారి దగ్గర కాంపౌండరుగా చేర్పించారు. ఆ చెరియన్ డాక్టర్‌గారు అమెరికాలో డాక్టర్‌గా పనిచేసి వచ్చినవారు కావటంతో మా నాన్నగారిని కూడా ఊళ్ళో చాలామంది 'అమెరికన్ డాక్టరు' అని పిలుస్తుండేవారు.

అలా చెరియన్‌గారి దగ్గర కొన్నాళ్ళు వైద్యం నేర్చుకుని తిరిగి నిడదవోలు వచ్చి మా నాన్నే మా తాతగారికి అసిస్టెంట్‌గా స్థిరపడ్డారు. అప్పట్లో నిడదవోలులో మరో ఆసుపత్రికానీ, డాక్టరుకానీ లేకపోవటంవల్ల మా ఊరు చుట్టుపక్కల గ్రామాలనుంచి కూడా రోగులు చాలామంది వైద్యం కోసం మా ఇంటికి వస్తూండేవారు. చాలా సందర్భాల్లో మా తాతగారు గుర్రపు బండిమీదా, మా నాన్నగారు సైకిలు మీదా ఆయా గ్రామాలకు వెళ్ళి రోగులకు వైద్యం చేసి వస్తూండేవారు. ఇద్దరూ తమ హస్తవాసి మంచిదన్న పేరు సంపాదించుకున్నారు.

ఇక నా చదువు విషయానికి వస్తే - అయిదో సంవత్సరం నిండగానే నన్ను ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించారు. నిడదవోలు పాటిమీద కాపురం వుండే, గొల్లపల్లి రామ్మూర్తి మేస్టారు దగ్గరకు పంపించి నాకు ట్యూషన్ చెప్పించేవారు. నేను స్కూల్లో నాలుగవ తరగతి పాసవగానే, అయిదో క్లాసు చదివించకుండా నేరుగా ఆరో తరగతికి ఎంట్రన్స్ పరీక్ష రాయించారు. అది ఎలా పాసయ్యానో పాస్ చేయించారో నాకే తెలియదు. మొత్తానికి అయ్యాను. అపుడు మా వూరి 'మూడు రోడ్ల మొగ' దగ్గర వున్న బోర్డు హైస్కూలులో ఆరవ తరగతిలో చేరాను.

1954లో అత్తెసరు మార్కులతో ఎస్.ఎల్.ఎల్.సి పాసయ్యాను. అన్నట్లు అప్పట్లో ఎస్.ఎస్.ఎల్.సి పరీక్ష రాయాలంటే విద్యార్థి వయస్సు 15 సంవత్సరాలు నిండి వుండాలి. నాకు పద్నాలుగే కదా! అందుకని పుట్టిన తేదీని ఒక ఏడాది పెంచి 12.6.1939గా నమోదు

చేయించారు మా నాన్న. ఇక మా ఊళ్ళో కాలేజీ లేకపోవటం వల్ల నన్ను ఏలూరులో నివాసం ఉంటున్న మా మేనత్త సీతామహాలక్ష్మిగారి ఇంట్లో వుంచి - అక్కడ వున్న కట్టమంచి రామలింగారెడ్డి కళాశాలలో ఇంటర్ మీడియట్ చదివే ఏర్పాటు చేశారు.

అప్పట్లో నేను పాటలు బాగా పాడుతూ వుండేవాణ్ణి. నిడదవోలులోని ఓ సాంస్కృతిక సంస్థ అయిన 'అభ్యుదయ కళా సమతి' ఓ సారెపుడో నిర్వహించిన పాటల పోటీలో 'జగమేమాయ బ్రతుకే మాయ' అనే పాట పాడి ద్వితీయ బహుమతిని పొందాను. ఏలూరు కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సినీ నటుడు శ్రీ జగ్గయ్యగారు ముఖ్య అతిథిగా వచ్చినపుడు (1955) అదే పాటని వేదికమీద పాడి ఆయన మెప్పుపొందాను.

ఆ రోజుల్లో ఘంటసాలగారి పాటలంటే ప్రాణం పెట్టేవాడిని. ఇప్పటికీ వారి పాటలు వింటూనే ఉంటాను. 1954లో అనుకుంటాను. నిడదవోలుకి పక్కనే వున్న వేలివెన్ను గ్రామానికి ఘంటసాల వెంకటేశ్వరరావుగారు వచ్చారు. ఆయన్ని చూసేందుకూ, ఆయన పాటలు వినేందుకూ చుట్టుపక్కల గ్రామాలనుంచి వేలాదిగా అభిమానులు వచ్చారు. నేనూ వెళ్ళాను. వేదికచుట్టూ జనం కిక్కిరిసి పోయారు. ఘంటసాలగారు ఇంకా సభకి రాలేదు. ఎవరెవరో కుర్రాళ్ళు వేదిక ఎక్కి పాటలు పాడుతున్నారు. ఘంటసాలగారిని దగ్గరనుంచి చూడాలన్న తపనతో అక్కడవున్న ఓ వాలంటీర్‌ని సమీపించి 'నేనూ పాడతాను. వేదిక దగ్గరకు తీసుకెళ్ళండి' అని కోరాను. అతను నన్ను అక్కడికి తీసుకువెళ్ళాడు. నేను వేదిక ఎక్కి అప్పట్లో విడుదలైన 'పెళ్ళిచేసిచూడు' సినిమాలోని 'ఓ భావిభారత భాగ్య విధాతలారా!" అనే పాట పాడాను. జనాలు చప్పట్లు కొట్టారు. వెంటనే అదే సినిమాలోని 'ఓ మనసులోని మనసా' అనే పాట అందుకున్నాను. అది పాడుతూండగా ఘంటసాలగారు సభా ప్రాంగణానికి విచ్చేసారు. నా పాట విన్న ఘంటసాలగారు 'ఈ చిరంజీవి ఎవరో బాగా పాడుతున్నాడు' అని నన్ను మెచ్చుకున్నారు.

పాటల సంగతి పక్కనెపెట్టి మళ్ళీ నా చదువు గురించి ప్రస్తావిస్తాను. మా తాతగారూ, నాన్నగారు వైద్యవృత్తిలో వుండటం వల్ల నేను కూడా డాక్టర్‌నైతే బాగుంటుందనుకుని ఇంటర్ మీడియట్‌లో నన్ను బై.పి.సి గ్రూపు తీసుకోమన్నారు. అంతటి చిన్న వయస్సులో ఏ గ్రూపు తీసుకుంటే ఏం ప్రయోజనం వుంటుందో కూడా తెలియక నేను తలవంచాను. కానీ అది ఎంతో కష్టమైనదని తీసుకున్న ఆరునెలలకే అర్థమైంది. 1956లో జరిగిన పరీక్షలో గ్రూపు ఫెయిలయ్యాను.

అపుడు వరంగల్లులోని గవర్నమెంట్ హైస్కూలులో మా పెద్ద బాబయ్య శ్రీవెంకట రమణమూర్తి సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూండటం వల్ల నాచేత సెప్టెంబరులో జరిగే సప్లిమెంటరీ పరీక్ష రాయించాలన్న తలంపుతో నన్ను ఆయన దగ్గరకు పంపించి ప్రిపేరవమన్నారు మా నాన్న. మూడు నెలలు ఆయన దగ్గరుండి చదివి, మళ్ళీ గ్రూపు పరీక్ష రాశాను. ఈసారీ తప్పాను. నాకు చదువు అంటదని భావించిన మా నాన్న నన్ను టైపు ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించారు. హయ్యరు గ్రేడు పరీక్ష పాసయ్యాను. ఇక ఉద్యోగం కావాలిగా? అదేమీ బజారులో దొరికే వస్తువు కాదాయె, కొని నా చేతిలో పెట్టటానికి.

అదే సమయంలో (1959) వరంగల్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న నా మేనత్త భర్త శ్రీ గోపాలకృష్ణమూర్తికి మా నాన్న ఓ ఉత్తరం రాశారు.(అప్పట్లో టెలిఫోన్ సౌకర్యాలు బొత్తిగా తక్కువ) ఆ ఉత్తరంలో నాకు ఏదైనా ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటుందేమో చూడమని ఆయన్ని కోరారు. వెంటనే ఆయన నన్ను పంపించమని జవాబు రాశారు. ఆయన పనిచేస్తున్న బ్యాంకులోనే టెంపరరీగా 'క్లర్క్-కం-టైపిస్ట్' ఉద్యోగం ఇప్పించారు. నెలకు తొంభై రూపాయల జీతం. అందులోంచి నెలకు ముప్పయ్ రూపాయలు మా మావయ్యకి ఇస్తూ వాళ్ళింట్లోనే 'పేయింగ్ గెస్ట్'గా మకాం పెట్టేశాను. అప్పటికి నా వయస్సు పంతొమ్మిది సంవత్సరాలు.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. నాకు పెళ్ళి జరిపించి ఓ 'ఇంటివాణ్ణి' చేయాలని సంకల్పించుకున్నారు మా నాన్న. ఏవైనా సంబంధాలు వుంటే చూడమని మా బంధుమిత్రులకు చెప్పారు. వాళ్ళు ఏవేవో సంబంధాలు తీసుకొచ్చారు. ఆ అమ్మాయిల్ని చూసేందుకు ఓ రోజు ఆఫీసుకు శెలవు పెట్టి నన్ను నిడదవోలు రమ్మన్నారు. ఒకేరోజు వరుసగా ముగ్గుర్ని చూసేశాను. ఆ ముగ్గురిలో తణుకు తాలుకా బల్లిపాడు గ్రామ కరణం శ్రీ పెమ్మరాజు లక్ష్మీనారాయణగారి అమ్మాయి మా ఇంట్లోవాళ్ళకు నచ్చింది. ఆ సంబంధమే ఖాయం చేసేశారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments